తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
29-06-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 141
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



# నల్లగొండ పొలాలకు కృష్ణా నీటిని పారిస్తా

- మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం: ఎవరు అడ్డం పడినా వెనక్కి తగ్గేది లేదు
- 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ పాలనే.. రాష్ట్రాన్ని నంబర్ వన్ చేస్తాం
- బీఆర్ఎస్ నాయకులవి త్యాగాలు కావు.. "ఎలక్షన్.. కలెక్షన్" రాజకీయాలు
- రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు
- 70 వేల ఉద్యోగాలు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు అండగా నిలిచాం

**తెలంగాణ బ్యూరో , (సిరి న్యూస్):**
వచ్చే అసెంబ్లీ ఎన్నికల లోపల ఎస్ఎల్బీసీని పూర్తి చేసి కృష్ణానది నీటిని నల్లగొండ నేల మీద పారిస్తానని, పంటలు పండించడమే కాకుండా డిండి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సంపూర్ణంగా సహకరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తన జీవిత లక్ష్యం ఒకటేనని... అది మూసీ నదీ ప్రక్షాళన అని అన్నారు. మోదీ సబర్మతీ, దిల్లీ యమునా కాదు... ఈ దేశానికి ఎవరు వచ్చినా ప్రక్షాళన తర్వాత

మిగతా 3వ పేజీలో..



# వికారాబాద్ భూములపై సీఎం రేవంత్ సోదరుల కన్ను



- జిల్లాలో నాలుగు దిక్కులా తిరుగుతూ సీఎం సోదరుల భూముల స్వాధీనం.
- రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల భూ కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్.
- కాంగ్రెస్ పాలనలో పూర్తిగా కుదేలైన రంగారెడ్డి, వికారాబాద్ రియల్ ఎస్టేట్.
- నాడు బీఆర్ఎస్ హయాంలో పారదర్శక అభివృద్ధి.. నేడు అంతా అనిశ్చితి.
- ప్రజల పక్షాన పోరాటం ఆపమంటూ వికారాబాద్ సభలో కేటీఆర్ వెల్లడి

**వికారాబాద్, జూన్ 28, (సిరి న్యూస్)**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికారాబాద్ జిల్లాలో భూ వ్యవహారాలు వివాదాస్పదంగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నాడు బీఆర్ఎస్ పాలనలో వికారాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై కూడా కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణా రెడ్డి

మిగతా 2వ పేజీలో..

## రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీ ఏర్పాట్లు

జగన్నాథపురంలో క్షేత్రస్థాయిలో సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, అధికారులు

వర్షం వచ్చినా ఆటంకం కలగొద్దు.. ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం

చింతకానిలో భారీ వర్షం.. బురద మయమైన సభా ప్రాంగణం, అధికారుల సమీక్ష

2





## పోలీస్ స్టేషన్ కు వాట్సాప్ పంచాయితీ!

- గ్రూప్ లో నుంచి తొలగించారని ఫిర్యాదు
- యాడ్ చేయించమని పోలీసులకు విజ్ఞప్తి
- వింత పంచాయితీపై విస్తుబోయిన పోలీసులు
- సోషల్ మీడియా ఎంత ప్రభావితం చేస్తుందో చూపుతున్న సంఘటన

2

## తెలంగాణ రోడ్లకు 'కోమటిరెడ్డి' కొత్త ఊపిరి!



- కేంద్ర, రాష్ట్ర నిధులు రూ. 78,000 కోట్లతో రహదారుల రూపురేఖల మార్పు
- నల్గొండలో రూ. 13,006 కోట్ల 'హెచ్ఏఎం' రోడ్డు పనులకు సీఎం, మంత్రి శంకుస్థాపన
- ప్రతి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు.. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యం
- 2028 ఆగస్టు నాటికి ప్రపంచంలో

2

## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయి.. సీఎం రేవంత్‌కు హరీష్‌రావు బహిరంగ సవాల్!



- పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్.
- రూ. 29 వేల కోట్ల రైతు భరోసాను కాంగ్రెస్ ఎగ్గొట్టిందని విమర్శ.
- కాళేశ్వరం కూలిపోతే హైదరాబాద్‌కు నీళ్లు ఎక్కడివని ప్రశ్న.
- సింగరేణి టెండర్లలో భారీ అవినీతి జరిగిందని ఆరోపణ.

3



## బీఆర్ఎస్‌లోని ఆ 'గుంటనక్క' తెలంగాణ శక్తులను దెబ్బతీస్తోంది!

- తెలంగాణ రక్షణ సేన (TRS) చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు
- సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేదు
- జూలై 2న ఉప్పల్ భగాయల్‌లో ఉద్యమకారుల భూపోరాటం

2

## తెలంగాణలో అధికారంలోకి వస్తాం

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు హైదరాబాద్‌ను మజ్లిస్‌కు దారాదత్తం చేశారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' రావాలి.

ఎస్ఐఆర్ (SIR) సర్వేపై విపక్షాల ఉలిక్కిపాటు ఎందుకు? ఉద్యోగులను అవమానించొద్దు.

పాతబస్తీలో రోహింగ్యాల దొంగ ఓట్లు.. విదేశీయుల పేర్లు ఓటర్ లిస్టులో ఉండొద్దు.

2



## పోలియో రహిత తెలంగాణే లక్ష్యం

- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి.
- లక్ష్యం 52 లక్షలు: జూన్ 28, 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా చుక్కల మందు పంపిణీ.

**జూబ్లీహిల్స్, (సిరి న్యూస్):**
ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు తెలంగాణ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర

మిగతా 2వ పేజీలో..




# అమాయక బాధితులే సమిధలు !

భూ బాధితులకు రాజకీయ ఓదార్పులు !!

హస్మత్‌పేట భూ కుంభకోణంపై రాజకీయ రచ్చ

అన్యాయం జరిగాక నేతల మొసలి కన్నీరు

మోసం చేసిన కేటుగాళ్ళపై చర్యలేవి ?

నాడు అక్రమార్కులకు మద్దతు పలికిందెవరు ?

నష్టపోయిన బాధితులకు తక్షణ సహాయం ఏదీ ?

త్వరలో సిరి పత్రికలో పూర్తి ఆధారాలతో వరుస కథనాలు

**బోయిన్‌పల్లి, జూన్ 28 (సిరి న్యూస్ ) :**
హస్మత్‌పేట్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1లో 10 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నవాబుల ప్రైవేటు భూమిగా నమ్మబలికి నోటరీ ప్లాట్ల పేరుతో విక్రయించిన భూమి ప్రభుత్వ స్థలమని తేలడంతో శనివారం హైడ్రా భారీ పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. దీంతో జీవితకాల పొదుపులు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసిన బాధితులు రోడ్డున పడ్డారు. దళారులు,

మిగతా 2వ పేజీలో..





# పోలియో రహిత తెలంగాణే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

రాజనర్సింహ పిలుపునిచ్చారు. పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది విస్తృత చర్యలు చేపడుతున్నారని వివరించారు. బోరబండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమ ప్రారంభోత్సవంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజనర్సింహతో కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. గత 14 సంవత్సరాలుగా తెలంగాణలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని, దీనికి తల్లిదండ్రుల్లో పెరిగిన అవగాహన, ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి ప్రధాన కారణమని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. జూన్ 28, 29, 30 తేదీల్లో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మంత్రి కోరారు. మన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని, పోలియో నిర్మూలన కోసం ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ముందస్తు జాగ్రత్తగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి ఇంటికీ పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఆరోగ్య శాఖ కమిషనర్ డా. ఎస్. సంగీత సత్యనారాయణ, డా. నాగలక్ష్మి (మెడికల్ ఆఫీసర్), డా. విజయ్ నిర్మల (జాయింట్ డైరెక్టర్ - చైల్డ్ హెల్త్ & ఇమ్యూనైజేషన్), డా. పుట్ల శ్రీనివాస్ (డీఎంహెచ్‌వో), డా. సంధ్య (డిప్యూటీ డీఎంహెచ్‌వో), డా. పెటర్సన్, డా. జ్యోత్స్న, డా. డేవిడ్, డా. మురారి, డా. శ్రీనాథ్, డా. శ్రీధర్, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికారాబాద్ భూములపై సీఎం రేవంత్ సోదరుల కన్ను

**మొదటిపేజీ తరువాయి**



వికారాబాద్ జిల్లాలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు దిక్కులా తిరుగుతూ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసిందని కేటీఆర్ విమర్శించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం తగ్గిపోయిందని, భూముల కొనుగోలు, విక్రయాలపై అనిశ్చితి నెలకొన్నదని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలకు ప్రోత్సాహం లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు అమలు చేశామని, దాని ఫలితంగానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించారు.

# రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి తుమ్మల ఆదేశం

**ఖమ్మం, (సిరి న్యూస్)**

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి, జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో రైతులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, ప్రధాన వేదిక, రైతులు కూర్చునే ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సభకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షం వచ్చినా కార్యక్రమానికి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని, సభా ప్రాంగణంలో నీరు నిల్వ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ సదుపాయాలు, వాహనాల రాకపోకల నిర్వహణ, రైతుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకుని, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఆదివారం చింతకాని మండలంలో కురిసిన భారీ వర్షానికి సభా ప్రాంగణంలో కొంత మేర బురద పేరుకు పోయినట్లు సమాచారం. సభ నిర్వహణకు సంబంధించి అధికారులు పరిస్థితిని సమీక్షి

# అమాయక బాధితులే సమిధలు !

**మొదటిపేజీ తరువాయి**

అధికారులు, రాజకీయ నాయకుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండగా అసలు భూమాఫియాపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు..

**అసలు దోషులు ఎవరు?..**
**నిగ్గుతేల్చే పనిలో సిరి పత్రిక**

ఇదిలావుండగా ఈ అంశంపై బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తమ తమ స్పందనలు వెల్లడించారు. అయితే ఏది ఏమైనా సిరి తెలుగు దినపత్రిక బృందం ఈ భూ వివాదంపై ప్రత్యేక విచారణ చేపడుతుంది. బాధితులు అసలు ఎవరి చేత మోసపోయారు.? ఈ భూమిని ప్రైవేటు పేరుతో విక్రయించింది ఎవరు.? ఈ వ్యవహారం వెనుక ఉన్న బ్రోకర్లు, దళారులు, కీలక వ్యక్తులు ఎవరు.? అధికారుల పాత్ర ఏమిటి.? అనే అంశాలపై పూర్తి ఆధారాలు, పత్రాలు, బాధితుల వాంగ్మూలాలతో ప్రత్యేక కథనాలను సిద్ధం చేస్తోంది. హస్మత్‌పేట్ సర్వే నంబర్1 భూ వివాదం వెనుక దాగి ఉన్న అసలు కథ, కీలక ఆధారాలు, సంచలన నిజాలు..త్వరలోనే సిరి తెలుగు దినపత్రిక తదుపరి సంచికల్లో వరుస కథనాల రూపంలో మీ ముందుకు రానున్నాయి.

### బాధితులకు అండగా బీఆర్ఎస్...



హస్మత్‌పేట్ సర్వే నంబర్ 1లో హైడ్రా కూల్చివేతలతో నష్టపోయిన బాధితుల పక్షాన బీఆర్ఎస్ నిలుస్తుందని ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ప్రకటించారు. ప్రభుత్వ భూమి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అవసరమైతే జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, హైడ్రా కమిషనర్‌ను కలిసి బాధితుల సమస్యలను వినిపిస్తామని చెప్పారు. దళారుల మోసాలకు పాల్పడిన వారిపై రాజకీయాలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని అదే ప్రాంతంలో బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు..


**- మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్..**

### బాధితుల వద్దకు ఈటల.. పేదల ఇళ్లపై జేసీబీలు నడపొద్దు..



హస్మత్‌పేట్ సర్వే నంబర్-1లో హైడ్రా కూల్చివేతలతో నష్టపోయిన బాధితులను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. బాధితుల గోడును విని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
పేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేయడం సరికాదని, భూమి ప్రభుత్వానిదా, పురావస్తు శాఖదా, ప్రైవేటుదా అనే అంశంపై రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళారుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని, అమాయకులను మోసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. వివాదాస్పద భూములు కొనుగోలు చేసే ముందు ప్రజలు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించాలని సూచించిన ఆయన, ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ పెద్దఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు..

### అది ప్రైవేట్ భూమి కాదు.. బాధితులకు అండగా ప్రభుత్వం



హస్మత్‌పేట్ సర్వే నంబర్-1 భూమిపై కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ స్పందించారు. సిరి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఆ స్థలం ప్రైవేట్ భూమి కాదని, అధికారిక రికార్డుల ప్రకారం పురావస్తు శాఖకు చెందిన ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు తానే స్వయంగా సంబంధిత రికార్డులను హైడ్రా అధికారులకు సమర్పించి ఫిర్యాదు చేశానని తెలిపారు. అక్రమార్కుల మోసానికి గురైన అమాయక ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. బ్రోకర్ల చేత మోసపోయిన బాధితులు ముందుకు వచ్చి వివరాలు అందిస్తే సంబంధిత దళారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకపై ఆ ప్రాంతంలో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

**- కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్**

# బీఆర్ఎస్‌లోని ఆ 'గుంటనక్కే' తెలంగాణ శక్తులను దెబ్బతీస్తోంది!

**తెలంగాణ బ్యూరో, (సిరి న్యూస్):**



తెలంగాణ ఉద్యమాన్ని ఒకప్పుడు అడ్డుకున్న శక్తులకు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న గుంటనక్కే పాలుపోసి పెంచుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ అస్తిత్వం పై దాడులు జరుగుతున్నప్పటికీ బీఆర్ఎస్ స్పందించకపోవడం వెనుక అదే కారణమని ఆరోపించారు. ఆదివారం ఉప్పల్ పిస్తా హౌస్ చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అవాకులు, చేవాకులు పేలిన వారే ఇప్పుడు మళ్లీ తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు ప్రోత్సాహం అందిస్తున్నది బీఆర్ఎస్‌లోని గుంటనక్కే అని ఆరోపించిన కవిత.. అందుకే తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు వచ్చినా ఆ పార్టీ మౌనంగా ఉంటోందన్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణతో ఉన్న పేగు బంధం తెగిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ కూడా తెలంగాణ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణలోని ప్రభుత్వ డెయిరీల నుంచి పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలకు పాల సరఫరా జరిగేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఆ సంస్థల్లో ధోబీలు, హెయిర్ కటింగ్, ఫర్నిచర్ సరఫరా, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

**ఇడుపు కాగితం అర్థం ఏంటో ఆయనకు తెలుసు**

ఇడుపు కాగితం సినిమా టైటిల్ వివాదంపై స్పందించిన కవిత.. ఆ పదానికి అర్థం ఏమిటో పవన్ కళ్యాణ్ బాగా చెప్పగలరని వ్యాఖ్యానించారు. తెలంగాణ భాష, యాసను అవమానించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. ఒకరి భాషను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు.

**జూలై 2న భూపోరాటం**

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 గజాల స్థలం కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున భూపోరాటం చేపడతామని కవిత ప్రకటించారు. ఉద్యమకారులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# పోలీస్ స్టేషన్ కు వాట్సాప్ పంచాయితీ!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

సామాజిక మాధ్యమంలో ఓ మహిళ తరచూ రాజకీయ సందేశాలు పెడుతుందని ఆమెను ఆ గ్రూప్ లోనుండి తొలగించారు. దీంతో తనను గ్రూప్లో నుంచి తొలగించారని ఆమె నేరుగా పోలీస్ స్టేషన్ కెళ్ళింది. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కు అందిన ఈ ఫిర్యాదు సోషల్ మీడియా ప్రభావం ఇప్పటి మనుషులపై ఎంతలా ఉంటుందో చూపింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో ఆ కాలనీ వాసులకు ఒక వాట్సాప్ గ్రూప్ ఉందట. ఆ గ్రూప్ లో నుంచి ఒక మహిళా సభ్యురాలిని తొలగించారట. ఆమె అడ్మిన్ ను సంప్రదిస్తే 'ఇది మన కాలనీ గ్రూప్ ఇక్కడ కాలనీ సమస్యలు మాత్రమే చర్చకు రావాలి. రాజకీయాలు వద్దన్నా మీరు పదే పదే పెడుతున్నారు అందుకే తొలగించాం' అని చెప్పారట. అయితే సదరు మహిళా నన్ను గ్రూప్ లో నుంచి తొలగించి అవమానించారని బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అడ్మిన్ ని విచారిస్తే ఆమె చేష్టలతో విసిగి గ్రూపులో నుంచి తొలగించామని చెప్పారట. అయితే ప్రజల సమస్యల కోసం ఉన్న తమను ఇలా వాట్సాప్ పంచాయితీలకు కేంద్రగా వాడుకోవడంపై పోలీసులే విస్మయం చెందారట. ఇలా ఉంది మరి జనాల్లో వాట్సాప్ గ్రూపుల పంచాయితీ..

# తెలంగాణలో అధికారంలోకి వస్తాం: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, (సిరి న్యూస్)**

త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లిలో జరిగిన బీజేపీ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని విమర్శించారు. హైదరాబాద్ ను ఈ రెండు పార్టీలు మజ్లిస్ కు దారాదత్తం చేశాయని మండిపడ్డారు. కాబట్టి హైదరాబాద్ ప్రజలు ఆలోచించాలని, బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడితే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఎందుకు ఉలిక్కిపడుతున్నాయని ప్రశ్నించారు. ఇంటింటి సర్వేకు వెళ్లేది తెలంగాణ ఉద్యోగస్తులేనని, ఉద్యోగులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కు నమ్మకం లేదా అని అడిగారు.
వారిని అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాతబస్తీలో అనేక దొంగ నోట్లు ఉన్నాయని అక్కడ రోహింగ్యాలు, బంగ్లాదేశ్ నుండి వచ్చిన వాళ్లు ఉన్నారని చెప్పారు. ఈ దేశం కానివాళ్ల పేర్లు ఓటర్ లిస్టులో ఉండటానికి వీలు లేదని అన్నారు. హైదరాబాద్ ను రక్షించడం కోసం ప్రజలంతా ఎస్ఐఆర్ లో పాల్గొనాలని అన్నారు. ఇది వరకు ఎస్ఐఆర్ ఏడెనిమిది సార్లు జరిగిందని అప్పుడు లేని ఇబ్బంది ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఏ జిల్లా అయినా, ఏ రాష్ట్రం అయినా హైదరాబాద్ లో ఉంటే వాళ్లు ఓటు హక్కును ఇక్కడికి మార్పించుకోవచ్చని అన్నారు. ఎప్పుడైనా ఓటరు తాము నివాసం ఉంటున్న ప్రాంతానికి ఓటును మార్చుకోవచ్చని చెప్పారు.

# తెలంగాణ రోడ్లకు 'కోమటిరెడ్డి' కొత్త ఊపిరి!

- **కేంద్ర, రాష్ట్ర నిధులు రూ. 78,000 కోట్లతో రహదారుల రూపురేఖల మార్పు**
- **నల్గొండలో రూ. 13,006 కోట్ల 'హెచ్ఏఎం' రోడ్డు పనులకు సీఎం, మంత్రి శంకుస్థాపన**
- **ప్రతి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు.. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యం**
- **2028 ఆగస్టు నాటికి ప్రపంచంలో**

**తెలంగాణ బ్యూరో, (సిరి న్యూస్) :**



గత పదేళ్లలో కనీసం గుంతలు కూడా పూడ్చని దుస్థితి నుంచి, నేడు తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి కొత్త ఊపిరి పోస్తున్నామని.. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ. 6,500 కోట్ల రాష్ట్ర నిధులను మంజూరు చేసి రోడ్ల పనులు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డు సమీపంలో నల్గొండ-దేవరకొండ రహదారిపై రూ.13,006.27 కోట్ల వ్యయంతో 6,092.37 కిలోమీటర్ల మేర 441 హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) రహదారుల విస్తరణ, బలోపేతం పనులకు సంబంధించిన శంకుస్థాపన పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రూ.83 కోట్ల వ్యయంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 1 పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నల్గొండ ఎన్‌జీ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక సభలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు.

**కనగల్ టు బందర్.. వయా అమరావతి**

'హైదరాబాద్‌విజయవాడ సిక్స్ లేన్, కనగల్ నుంచి అమరావతి మీదుగా బందర్‌కు గ్రీన్ ఫీల్డ్ హైవే, బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేలతో పాటు హెచ్ఏఎం పథకం కింద పనులు చేపడుతున్నాం. కేంద్ర, రాష్ట్ర నిధులు మొత్తం కలుపుకుని సుమారు రూ.78,000 కోట్లతో రహదారుల రూపురేఖలు మారుస్తున్నాం. పరిశ్రమల స్థాపన, స్థానిక యువతకు ఉపాధి లక్ష్యంగా ప్రతి మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో కలుపుతూ డబుల్ రోడ్లు నిర్మిస్తున్నాం. తద్వారా మన పిల్లలు సొంతూరిలోనే ఉపాధి పొందుతూ తల్లిదండ్రులను, వ్యవసాయాన్ని చూసుకునే అవకాశం కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాలకు వెళ్లే మన ప్రజలందరూ ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా క్షేమంగా తిరిగి ఇళ్లకు చేరుకోవాలన్నదే నా తపన, మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

**ప్రతిపక్షాలవి అర్థరహిత విమర్శలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అర్థరహిత విమర్శలు చేస్తున్నాయని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పేరు పూటకోసారి మార్చుకునే వారు కాంగ్రెస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పిలిచిన టెండర్లపై లేనిపోని ఆరోపణలు చేసే ప్రతిపక్ష నేతలు, నైతికత ఉంటే మూసీ బాధితుల దగ్గర నిద్రించి వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. 2028 ఆగస్టు నాటికి ప్రపంచంలోనే పొడవైన సొరంగం ద్వారా నల్గొండకు సాగునీరు అందించి, నాలుగు లక్షల ఎకరాలకు నీరందిస్తామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన ద్వారా కలుషిత నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# నల్లగొండ పొలాలకు కృష్ణా నీటిని పారిస్తా : సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి



మూసీని చూసేందుకే రావాలని అన్నారు. మూసీ కంపు నుంచి కాలుష్యం నుంచి నల్లగొండ బిడ్డలకు విముక్తి కలిగించే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. వట్టేసి చెప్తున్నా మూసీ పూర్తి చేస్తా... ఎవరొచ్చినా, ఎవరు అడ్డం పడినా, ఇంకెవరు ఆత్మహత్య చేసుకున్నా మూసీలో వేసి తొక్కుతానని హెచ్చరించారు. మూసీ నదీ ప్రక్షాళన చేస్తానని పేర్కొన్నారు. రాసుకోండి... 1994 నుంచి 2004 రెండుసార్లు టీడీపీ, 2004 నుంచి 2014 రెండుసార్లు కాంగ్రెస్, 2014 నుంచి 2023 వరకు రెండుసార్లు బీఆర్ఎస్... 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో మూడు రంగుల జెండా ఎగురుతుందని... తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తీరుస్తుందన్నారు. ఇదే తన మాట అని ప్రజలకు తనకు అండగా నిలబడాలని... రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 13వేల కోట్లతో చేపట్టిన 6300 కి.మీ. హ్యామ్ రోడ్ల పనులకు ఆదివారం నల్లగొండలో శంఖుస్థాపన చేసిన తర్వాత ఏర్పాటు చేసిన ప్రజా సభలో సీఎం ప్రసంగించారు.

**ఎలక్షన్ చేయటం, కలెక్షన్ చేసుకోవడమేనా వారి త్యాగం...**

తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలిసిన ప్రతి ఒక్కరికీ ఈ అంశం తెలుసు... తొలి తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం సాధిస్తేనే మంత్రి పదవిని తీసుకుంటామని పేర్కొన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ లాగే... నల్లగొండ నుంచి ఆమరణ నిరహారదీక్ష చేసి ఆరోగ్యం పాడుచేసుకుని... తెలంగాణ రాష్ట్రంలోనే మంత్రి పదవిని చేపట్టారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ నాయకులు త్యాగాలు చేశామని చెప్పుకుంటారని... కానీ త్యాగం అంటే ఎలక్షన్ చేయటం, కలెక్షన్ చేసుకోవడమేనా వారి త్యాగం అని ప్రశ్నించారు. వారిది త్యాగం అయితే తన మంత్రి పదవికి రాజీనామా చేసి చనిపోయేంత వరకు మంత్రి పదవినే చేపట్టని కొండా లక్షణ్ బాపూజీ త్యాగాన్ని ఏమనాలో చెప్పాలన్నారు. ఎలక్షన్, కలెక్షన్, సెలెక్షన్ మీద తిరుగుతుంటే పదవి త్యాగం చేసి తెలంగాణ రాష్ట్రంలోనే మంత్రి పదవి చేపట్టిన కోమటిరెడ్డి త్యాగాన్ని ఏమనాలన్నారు. 100 రూ. పెట్టి పెట్రోలు తెచ్చుకున్న మీరు... 10 పైసలు పెట్టి అగ్గిపెట్టె తెచ్చుకోని అగ్గిపెట్టె రావుదే త్యాగం అయితే తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి త్యాగాన్ని ఏమనాలని ప్రశ్నించారు. కానిస్టేబుల్ కిష్టయ్య నేలకొరిగిన త్యాగాన్ని, యాదయ్య, ఈషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి త్యాగాన్ని ఏమనాలని ప్రశ్నించారు. అగ్గిపెట్టె రావు పదేళ్లు ఆర్థిక, సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నాడని... రూ.69వేల కోట్ల అప్పులో ఉన్న తెలంగాను రూ.8.11లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచి రాష్ట్రాన్ని శాశ్వతంగా పదేళ్లలో వందేళ్లకు సరిపోయే విధ్వంసం చేసిన వారిని ఏమనాలని ప్రశ్నించారు. ఈ తెలంగాణ ప్రజలు ఇంకా మిమ్మల్ని భరించాలా... మీ దోపిడీని తెలంగాణ ప్రజలు ఇంకా సహించాలనా అని అన్నారు.

**తోడేళ్ల మాదిరిగా తిరుగుతున్నారు...**

బావ, బామ్మర్దులు ఇద్దరూ తెలంగాణ మీద తోడేళ్ల మాదిరిగా పడి తిరుగుతున్నారని... తమ ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని వారు చెబుతున్నారని... కానీ ప్రజలెవరూ కోరుకోవడం లేదని... వారి కుటుంబం, వారి దోపిడీకి అండగా నిలబడిన వారు మాత్రమే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజాపాలన ప్రజలంతా సంక్షేమ పథకాలను పొందుతుంటే అసూయ పడుతున్న వాళ్లు వారిని కోరుకుంటున్నారేమో కానీ తెలంగాణ సమాజం వారి కుటుంబాన్ని శాశ్వతంగా సామాజిక బహిష్కరణ చేశారని అన్నారు. భవిష్యత్తులో వారికి పదవి అనేదే ఉండదన్నారు. బీఆర్ఎస్ గురించి మాట్లాడాలంటే వారి గతం గురించే కానీ భవిష్యత్తు అనేదే ఉండబోదన్నారు. బీఆర్ఎస్ ను ఉప్పపాతర వేసినం... మళ్లీ మొక్క కూడా మొలవనీయమని నల్లగొండ జిల్లా ప్రజలు చెప్తున్నారని పేర్కొన్నారు. తాము చేసిన పనులు చెప్పుకోకపోవడం వల్ల బావబామ్మర్దులు బిల్లారంగాలు ఊరూరు తిరిగి అబద్దాలు చెప్తున్నారని అన్నారు. నిజం మాట్లాడితే వేయి ముక్కలై చస్తారని దేవుడు వారికి శాపం పెట్టిండన్నారు. ఒక్క మాట కూడా నిజం మాట్లాడరని... మొత్తం కుటుంబం అంతా అంతేనని ఎద్దేవా చేశారు. ఫాంహౌస్ లో పడుకున్న శుక్రాచారుడు, ఊర్ల మీద తిరిగే మారీచుడు, సుభావుడు వీరంతా ఒకటే తీరన్నారు. "నోరు తెరిస్తే అబద్దాలు చెప్తారు. ఒక్క అబద్దాన్ని వందసార్లు చెప్తే నమ్మకపోతారా అని అనుకుంటారు... ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలను ఎలా పొట్టన పెట్టుకున్నారో... అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని ఎలా కొల్లగొట్టారో ఏ విధంగా అక్రమ కేసులు పెట్టారో వారి జాతకమంతా తెలంగాణ సమాజానికి తెలుసు. ఎన్ని అబద్దాలు చెప్పినా, ఎన్ని నాటకాలు వేసినా తెలంగాణ సమాజం నమ్మదు, క్షమించదు..." అని విమర్శించారు. మంత్రి లక్ష్మణ్ రూ.687 కోట్ల టెండర్లు పిలిస్తే రూ.3వేల కోట్ల అవినీతి జరిగిందన్నారని.... సింగరేణిలో టెండరే కాకున్నా... మొత్తం సింగరేణిని కొల్లగొట్టారని అబద్దాలు చెప్తున్నారని పేర్కొన్నారు. "తులసీ వనంలో గంజాయి మొక్కలాగా సూర్యాపేటలో ఒకడు జానడోడు మిగిలిండు... మా వెంకన్న మీద ఎగురుతుండు.... మళ్లీ మొలవకుండా చూసుకుంటామని సూర్యాపేట వాళ్లు చెప్పారని" సీఎం అన్నారు.

**పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, ఇందిరమ్మ పాలనపై చర్చకు సిద్ధమా...**

అధికారం కోల్పోయిన అక్కసుతో కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నారని... మూసీ కంటే వీరి కడుపులోనే విషం ఎక్కువగా ఉంది... రేవంత్ రెడ్డి ఏం తెచ్చాడని అడుగుతున్నారని... అయితే పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పన్నెండేళ్ల బీజేపీ పాలన, రెండున్నరేళ్ల తమ పాలనపైన చర్చ చేద్దాం మీరు సిద్ధంగా ఉన్నారా... అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ ఏర్పాటు నుంచి... తెలంగాణ ఏర్పాటు కోసం చేసుకున్న బలిదానాల మీద దేనిమీదైనా చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. పేదవాడి గుర్తింపే రేషన్ కార్డు... పదేళ్లు రేషన్ కార్డే ఇవ్వలేదని... తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే దాన్ని బర్రెలకు దాణాగా వేసే పరిస్థితి ఉండేదని... ఇప్పుడు ఏడాదికి రూ.16వేల కోట్లతో 3.28కోట్ల పేదలకు ఆరు కిలోల చొప్పన సన్న బియ్యం ఇస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ తింటున్న సన్నబియ్యమే పేదలంతా తింటున్నారని... అనుమానం ఉంటే తండాలకు వెళ్లి చూసుకోవచ్చని అన్నారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఇచ్చామని... ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు ఇచ్చామని... పేదలు పక్కా ఇళ్లు కట్టుకుంటుంటే వారి కడుపు అంతా మసిమసి అవుతోందన్నారు. గజ్వేల్ లో వెయ్యి ఎకరాల్లో కేసీఆర్, జన్వాడలో 100 ఎకరాల్లో కేటీఆర్, అల్లుడు మొయినాబాద్ లో 50 ఎకరాల్లో, శంకర్ పల్లిలో బిడ్డ 25 ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకోవచ్చు వందల కోట్లు ఖర్చు చేసి ఫాంహౌస్ లు కట్టుకునే వారు పేదలకు ఇళ్లు ఇస్తే ఎందుకు ఏడుస్తున్నారని ప్రశ్నించారు. ఏడాదికి 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల మందికి ఇళ్లు ఇచ్చేందుకు అవకాశం ఉండేదన్నారు. కానీ ఒక్కరోజైనా పేదోడికి ఇళ్లు ఇవ్వాలనే సోదీ లేకుండా పోయిందన్నారు. పేదోడికి ఇళ్లు ఇవ్వాలనే ఆలోచనే వారికి రాలేదన్నారు. రైతుల కోసం తాము ఈ 30 నెలల్లో రూ. 1.56వేల కోట్లు ఖర్చుపెట్టామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం ఎన్నిసార్లు తిప్పినా రాష్ట్రాభివృద్ధికై నిధుల కోసం వెళ్తున్నామన్నారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా నానా తిప్పలు పడి 80లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి ఈ ఏడాది రికార్డు సృష్టించామన్నారు. రెండేళ్లలో 2.88లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే రికార్డు స్థాయిలో నంబర్ వన్ చేరామన్నారు. లక్ష కోట్ల కోట్లతో కాళేశ్వరం కడితే మూడేండ్లలోనే కట్టుడు, కూలుడు, గోదావరిలో కట్టుకుపోవడం అయ్యిందన్నారు. హరీష్ రావు కాళేశ్వరావు అని పిలిపించుకుని కూలిపోతే అటువైపే చూడటం లేదన్నారు. ప్రభుత్వ బడికి, హాస్పిటల్ పోవాలంటే భయపడే రోజులు పోయాయని తెలిపారు. బ్రేక్ ఫాస్ట్, లంచ్, ఈవెనింగ్ స్నాక్స్ ఇచ్చి తెలంగాణ గురుకులాల నుంచి వందలాది మంది అంబేద్కర్ లను సృష్టించే ప్రయత్నం చేస్తున్నామని కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పేదోళ్ల పిల్లల కోసం ఆరుట్ల వంటి టీపీఎస్ లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 40 ఏళ్ల నుంచి రావణకాష్టంలా ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. వందేళ్లుగా లేని జనగణనలో కులగణనను చేశామన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచి కేంద్రంపైనా ఒత్తిడి తెచ్చామన్నారు.

**ప్రజాపాలన పోవాలంట... పాపాల భైరవుడు రావాలంట...**

రాష్ట్రానికి 30నెలల్లో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన పోవాలంట...పాపాల భైరవుడు రావాలంట... ఎందుకు రావాలి... ఉద్యోగాలిచ్చినందుకు తమ ప్రభుత్వం పోవాలా అని ప్రశ్నించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంటు, ఫీజు రీయంబర్స్ మెంట్, రైతు రుణమాఫీ, రైతుభరోసా, వంటి సంక్షేమ పథకాలు అమలు చేసినందుకు తమ ప్రజాపాలన పోవాలనా అని నిలదీశారు. "దశాబ్దాలుగా ఫ్లోరైడ్ పీడిస్తుంటే కోమటిరెడ్డి, జానారెడ్డి వైఎస్ఆర్ ను ఒప్పించి ఎస్ఎల్బీసీ 34 కి.మీ పూర్తి చేసి 10 కి.మీ అప్పచెప్తే పదేళ్లు పడావు పెట్టిన దుర్మార్గుడు. నీవు పడావు పెట్టిన ఎస్ఎల్బీసీని మేం పూర్తిచేసి 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు, నల్గొండకు తాగునీరు ఇస్తున్నందుకు తాము అధికారంలోకి పోవాల్నా" అని అన్నారు. "కడుపులో పుట్టబోయే బిడ్డ కన్ను వంకరో కాలు వంకరో పుడతారని అందుకే నిన్న మొన్ననే కొడుకు పెళ్లి చేసి హైదరాబాద్ పంపించినట్లు ఓ సోదరి తనకు చెప్పింది. మూసీ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, మునుగోడు, నల్గొండ జిల్లా వారి పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు నేను దిగిపోవాల్నా" అని ప్రశ్నించారు. తమ ఫోన్లు, అధికారుల ఫోన్లు విన్నారంటే రాజకీయం, అధికారం గురించి తెలుసుకునేందుకు విన్నాడనుకోవచ్చని... కానీ భార్యాభర్తల ఫోన్లు కూడా విన్న వాళ్లను చెప్పుతో కొట్టినా తక్కువేనన్నారు. ఆ పాపాల భైరవుడు, పరీక్ష పేపర్లు అమ్ముకుని వేల కోట్ల సంపాదించుకునేటోడు, కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు గోదావరిలో కలిపిన దుర్మార్గుడు, పేదలు రేషన్ కార్డులు అడిగితే పోలీస్ స్టేషన్లో పెట్టి కొట్టించిన వాడు, పదేళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తల ప్రాణాలు తీసినందుకా ఆ పాపాల భైరవుడు మళ్లీ రావాలా అని ప్రశ్నించారు. వారిలా తాము ఎవరిపైనా అక్రమ కేసులు పెట్టలేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మండలి చైర్ పర్సన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయి..

**సిద్దిపేట, (సిరి న్యూస్) :**



సీఎం రేవంత్ రెడ్డి తీరు పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డికి అబద్దాలు తప్ప నిజాలు మాట్లాడే అలవాటు లేదన్నారు. రైతు బంధు 45 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సిద్దిపేట నియోజకవర్గం నర్మెట లో హామీ ఇచ్చి 80 రోజులు గడుస్తున్న పూర్తిగా రైతు బంధు వేయని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. మరో రెండు పర్యాయాలు అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్న సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకున్న ఎమ్మెల్యే లతో రాజీనామా చేయిస్తే ప్రజా క్షేత్రంలో తెల్చుకుందామని హరీష్ రావు సవాల్ విసిరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మిలాన్ గార్డెన్ లో ఎస్ ఐ ఆర్ పై బీఎస్ వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...అధికార మదంతో బీఆర్ఎస్ పార్టీని ఉప్పు పాతర వేస్తానని మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు ఉప్పు పాతర వేస్తారన్నారు. రైతు భరోసా కింద రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం 3 పర్యాయాలుగా 29 వేల కోట్లు బాకీ పడిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పంట కొనుగోళ్లు, ఎరువుల పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా పై అసెంబ్లీలో చర్చ పెట్టాలన్నారు. యాసంగిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నార న్నారు. 202021 లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 91 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు గుర్తు చేశారు. రైతు బంధు, రైతు భరోసా, తడిచిన ధాన్యానికి పరిహారం, ఎరువులు అందించ నందుకు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్ ఎల్ బీసీ స్వరంగం పనులు 12 కిలో మీటర్ల మేర పూర్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ 2 సంవత్సరాల 8 నెలల పాలనా 12 మీటర్లు కూడా స్వరంగం తవ్వని దద్దమ్మ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పైగా 8 మంది కార్మికులకు బలిగొని, శవాలను సైతం బయటకు తీయలేదన్నారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ ఇచ్చి సింగరేణి టెండర్ శోధ కన్ స్ట్రక్షన్ పేరిట సృజన్ రెడ్డి కి కాంట్రాక్టు కట్టబెట్టారన్నారు. అవినీతిని బయట పెట్టడంతో టెండర్ కాలేదని సీఎం రేవంత్ రెడ్డి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం కూలిపోతే మూసీ కి, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నీరు ఎక్కడిదని సూటీగా ప్రశ్నించారు. కృష్ణ జలాలతో నల్గొండ ప్రాంతంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో నల్గొండలో బత్తాయి మార్కెట్, నకిరేకల్ లో నిమ్మకాయల మార్కెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంల మీటింగ్ మతలబు ఏంటని సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను ఎత్తిపేరిట పరుష పదజాలంతో తిడతూ ఆరు గ్యారంటీలను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మైక్ దొరికే మాజీ సీఎం కేసీఆర్ ను, బీఆర్ఎస్ నేతలను తిడుతూ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీ నే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారని హరీష్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : అసదుద్దీన్ ఒవైసీ

**చంపాపేట్, (సిరి న్యూస్) :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు చురుకుగా పాల్గొని తమ వివరాలను నమోదుచేసుకోవాలని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా తనతో పాటు కుటుంబ సభ్యులందరి ఎన్యూమరేషన్ ఫారమ్ నింపి, ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ప్రతి కుటుంబం తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారమ్ నింపిన అనంతరం ఓవైసీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమతో పాటు కుటుంబ సభ్యుల ఫారమ్‌లను పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఓఎల్)కు తప్పనిసరిగా అందజేయాలని కోరారు. ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. ఫారమ్ నింపే సమయంలో ఎలాంటి సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైనా, తమ ప్రాంతంలోని ఏఐఎంఐఎం కార్యకర్తలను సంప్రదించాలని లేదా దారుస్సలాం కేంద్ర కార్యాలయానికి వచ్చి సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవసరమని అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌కు వర్షసూచన.. ఈ ప్రాంతాల్లో కుండపోత వర్షం

**హైదరాబాద్, (సిరి న్యూస్)**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు భారీ వర్షసూచన ఉన్నట్టు వెదర్ మ్యాన్ బాలాజీ పేర్కొన్నారు. నగరంలో మధ్యాహ్నం వరకు ఎండలు మండిపోగా మధ్యాహ్నం తరవాత వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వర్షం కురుస్తుండగా మరికొన్ని ప్రాంతాలకు సైతం భారీ వర్షసూచన ఉన్నట్టు తెలిపారు. ముఖ్యంగా నగరంలోని సెంట్రల్ హైదరాబాద్ లో వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. ఖైరతాబాద్, జూబ్లిహిల్స్, అమీర్ పేట్, మెహిదీపట్నం, టోలిచౌకి, షేక్ పేట్ లో కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు.

అదే విధంగా పంజాగుట్ట, ఎల్లారెడ్డి గూడ, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి, మియాపూర్, బేగంపేట, బాలనగర్, బోయినపల్లి, సనత్ నగర్, యూసుఫ్ గుడ ప్రాంతాల్లోనూ వర్షం కురిసే ఛాన్స్ ఉందన్నారు. ఇక రాష్ట్రంలోకి ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇవ్వడంతో వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ తో పాటు ఇతర జిల్లాలోనూ వానలు పడుతున్నాయి. అయితే ఓవైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ మరోవైపు మధ్యాహ్నం సమయాల్లో ఎండలు సైతం అదే రేంజ్ లో కొడుతున్నాయి. దీంతో విభిన్నవాతావరణం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



# పోలియో చుక్కలతో ప్రజారోగ్య యజ్ఞం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 28 (సిరి న్యూస్)**

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని బెల్లంపల్లి బస్తి 19వ వార్డులో ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఈ సందర్భంగా దావ స్వాతి రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పోలియో చుక్కల సేవను ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకోవాలని, ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగలకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యవంతమైన బెల్లంపల్లి, పోలియో రహిత మంచిర్యాల జిల్లా, తెలంగాణ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి చేరుకుని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త నసీమ, ఆర్పీ సుజాత, అంగన్‌వాడీ ఆయా కాంత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుర్గం మహేందర్ (పప్పీ భాయ్), యువ నాయకుడు రామిల్ల ప్రదీప్, బ్లాక్ అధ్యక్షుడు అక్కపాక రంజిత్ కుమార్, యువజన ఉపాధ్యక్షుడు అబ్దుల్ జాబి ఇమ్ము, రామ్ నరేష్, కాంపెల్లి శివకుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.





# ప్రతి చిన్నారికి రెండు చుక్కలు.. జీవితానికి రక్ష..

- **ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి..**
- **పల్స్ పోలియోకు ఎమ్మెల్యే వినోద్ శ్రీకారం..**
- **పోలియో రహిత బెల్లంపల్లికి పిలుపు..**
- **తల్లిదండ్రులందరూ బాధ్యత తీసుకోవాలి..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 28 (సిరి న్యూస్)**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు.

ఆదివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా, బూడిదిగడ్డ బస్తీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు పోలియో వ్యాధి అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపేదని, ప్రభుత్వాలు నిరంతరం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాల ఫలితంగా దేశం పోలియో నిర్మూలన దిశగా విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన బెల్లంపల్లి, పోలియో రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు..

**పటాన్‌చెరు, జూన్ 28 (సిరి న్యూస్):**
దేశవ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

**శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహానికి భూమిపూజ**
జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న 12 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వరాజ్య స్థాపనకు ప్రతీకగా నిలిచిన శివాజీ మహారాజ్ ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా శివాజీ మహారాజ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఆయన గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేసే కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**ఉచిత వైద్య శిబిరం ప్రారంభం**
కృషి డిఫెన్స్ కాలనీలో డిఫెన్స్ సివిలియన్ ఆఫీసర్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల కోసం ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.






## చంద్రారెడ్డి చొరవ.. పారిశుధ్య దిశగా సరికొత్త అడుగు

**జిన్నారం జూన్ 28 సిరి న్యూస్**
బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తిలో పారిశుధ్య సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. చంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించి అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్య సమస్యను పరిశీలించారు. సమస్యపై వెంటనే ఫోన్లో అధికారులతో మాట్లాడారు. వర్షాల కారణంగా కాలనీలోకి చేరిన వరద నీటితో మ్యాన్ హోల్స్ పొంగడంతో తక్షణ చర్యల్లో భాగంగా పారిశుధ్య కార్మికులు పొగైన చెత్తాచెదారాన్ని తొలగించి సమస్యను పరిష్కరించారు. కాలనీలో ఇటీవల సిసి రోడ్ల ఏర్పాటుతో పాటు మౌలిక సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న నాయకులు చంద్రారెడ్డి'కి బస్తీ వాసులు ధన్యవాదాలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, సంజు, కిరణ్, శ్రీను, ప్రశాంత్, అంజన్న, బప్పి, రాములు, సత్యనారాయణ, వెంకటేష్, నవీన్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఓటర్ల తొలగింపుపై అప్రమత్తంగా వ్యవహరించాలి

- మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్
- ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం



**పటాన్చెరు, జూన్ 28 (సిరి న్యూస్):**
ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి, ప్రతి ఓటును కాపాడుకునేలా పనిచేయాలని మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్చెరులోని బండలగూడలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఎల్ఓలు నిర్వహించే ప్రతి పరిశీలనలో భాగస్వాములై ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఓటర్లకు సర్వే, ధ్రువీకరణ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసి, అవసరమైన పత్రాలు సమర్పించడంలో వారికి సహకరించాలని సూచించారు. పార్టీకి చెందిన ప్రతి ఓటు విలువైనదేనని, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని యాదగిరి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## పోలియో రహిత సమాజమే లక్ష్యం: కాల్వగడ్డ రాజ్‌కుమార్

- పల్లె దవాఖానకు ఆర్‌కే ఫౌండేషన్ తరపున ఫర్నిచర్, స్టేషనరీ అందజేత

**రామచంద్రపురం, జూన్ 28 (సిరి న్యూస్):**
దేశవ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్ గ్రామంలోని పల్లె దవాఖాన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
అనంతరం హెల్త్ అసిస్టెంట్ పద్మ కోరిన మేరకు పల్లె దవాఖానకు అవసరమైన ఫర్నిచర్, స్టేషనరీ సామగ్రిని ఆర్‌కే ఫౌండేషన్ తరపున కాల్వగడ్డ రాజ్‌కుమార్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సామాజిక సంస్థలు, దాతల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పల్లె దవాఖానకు అవసరమైన సామగ్రిని అందించిన ఆర్‌కే ఫౌండేషన్‌కు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారంతో హెల్త్ సెంటర్‌లో సేవల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, గట్టుపల్లి పండు, వాసుదేవ్, ఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.




## నిండు జీవితానికి రెండు చుక్కలు.. పల్స్ పోలియోకు విశేష స్పందన..

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన బూరుగడ్డ పుష్పనగేష్, ఐలేష్

**రామచంద్రపురం, జూన్ 28 (సిరి న్యూస్):**
"నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదంతో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి రామచంద్రపురంలో విశేష స్పందన లభించింది. శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యానికి అనుగుణంగా తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రామచంద్రపురం టౌన్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఐలేష్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో మందు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించవచ్చని, ఐదు సంవత్సరాల లోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగలకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జూలై 9న వర్కింగ్ జర్నలిస్టుల మహాసభ!

- ఇంటి స్థలాలు, అక్రిడేషన్ కార్డు హెల్త్ కార్డులపై చర్చ
- జిల్లా నూతన కమిటీ ఎన్నిక
- సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

**సంగారెడ్డి: జూన్ 28 (సిరి న్యూస్)**
సంగారెడ్డి జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజేఐజేయు) మహాసభ వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి ఇంటి స్థలం తో పాటు హెల్త్ కార్డును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎప్పటినుంచో కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ, జర్నలిస్టులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. అంతేకాకుండా మిగిలిన వారందరికీ కూడా అక్రిడేషన్ కార్డులను జారీ చేయాల్సిందిగా తమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని వివరించారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించడానికి జిల్లా మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. జూలై 9న ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ తో పాటు సంఘం రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు. జిల్లా మంత్రి తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని వివరించారు. అందువల్ల జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ మహాసభకు తరలి కావాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల ఐక్యతను చాటి చెప్పేందుకు సువర్ణ అవకాశమని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కూడా ఆ రోజు నిర్వహిస్తామని తెలిపారు.



## కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- భానూరులో బీఆర్ఎస్ భారీ ర్యాలీ.. కార్యకర్తలకు దిశానిర్దేశం

**పటాన్చెరు, జూన్ 28 (సిరి న్యూస్):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. హామీల అమలులో వైఫల్యంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.
ఆదివారం సాయంత్రం పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు ప్రవళిక నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లినట్లేనని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సహకరించకపోయినా పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, శివయ్య, నాగేష్, మధు, రవి, సత్తయ్య, మాణిక్యం తదితరులతో పాటు భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలసదనములో పిల్లలకు పూర్తి సౌకర్యాలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల జూన్ 28, (సిరి న్యూస్)**
బాలసదనములో పిల్లలకు అవసరమైన వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలసదనం భవనాన్ని మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకంలో 1 కోటి 34 లక్షల 93 వేల రూపాయల వ్యయంతో బాలసదనం భవన నిర్మాణం చేపట్టి అతి తక్కువ సమయంలో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. బాలసదనంలో 60 మంది పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, ఫర్నిచర్, వసతి గదులు, మూత్రశాలలు ఇతరత్రా కల్పించడం జరిగిందని, వాచ్ మెన్, వంట మనిషి ఇతర సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. బాలసదనములో వసతి పొందుతూ అర్హత గల బాలికలను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకు పంపించి విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహాల బాధితులు, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, అనాథలు, నిరాశ్రయులు, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు సురక్షిత ఆశ్రయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంరక్షణ, విద్య, వైద్య సేవలు, కౌన్సిలింగ్, పునరావాస సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ అనాథలు, నిరుపేద పిల్లల సౌకర్యం కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలసదనం ఏర్పాటు చేయడం జరిగిందని, పిల్లలకు ఎల్లప్పుడూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి పోషణ చూడడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, బాలసదనం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం అందరి సమిష్టి కృషితోనే సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి అధికారులు, బాలసదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు మంత్రి దామోదర్ కు కృతజ్ఞతలు

- **మున్సి పల్ చైర్మన్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు**

**జోగిపేట, జూన్ 28, (సిరి న్యూస్):**

అందోల్ నియోజకవర్గంలోని ముఖ్యమైన రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రూ.100 కోట్ల భారీ నిధులను మంజూరు చేయడం పట్ల అందోల్ జోగిపేట మున్సిపల్ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, నియోజకవర్గ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు మర్రి అరుణ కుమారి లు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నిధులతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించబడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని ఆయన అన్నారు. సంగుపేట నుంచి పోచారం వరకు గల 18 కిలోమీటర్ల రోడ్డు వెడల్పుకు రూ.40 కోట్లు, మొత్తం క్యాసారం నుంచి మునిపల్లి వయా గార్లపల్లి , అల్లాపూర్ వరకు గల 10 కిలోమీటర్ల రోడ్డు వెడల్పుకు రూ.30 కోట్లు, నార్సింగి నుంచి పెద్ద శంకరంపేట్ , ఎల్లు పేట వరకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కు రూ.30 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ప్రజా సంక్షేమం పట్ల మంత్రి దామోదర్ రాజనర్సింహ అంకితభావానికి, అభి



వృద్ధి పట్ల వారి దూరదృష్టికి ఈ నిర్ణయం నిదర్శనం అన్నారు. మంత్రి సమర్థ నాయకత్వంలో అందోల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత



అభివృద్ధి సాధించి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# మిషన్ భగీరథ నీరు వృథా..

- **అధికారుల నిర్లక్ష్యం, స్థానికుల ఆగ్రహం...**

**హత్నూర, జూన్ 28,(సిరి న్యూస్)**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో గత రెండు నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. దౌల్తాబాద్ నుంచి సంగారెడ్డి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెన (బ్రిడ్జి) కింద వాగులో పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరు నిరంతరంగా వృథా అవుతుంది. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం నీరు ఇలా వృథా కావడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా నీరు వాగులోకి పారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లు మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా ప్రతిరోజూ పెద్ద మొత్తంలో తాగునీరు వృథా అవుతుండగా,




మండలం లోని పలు గ్రామాల్లో చుట్టూ ప్రక్కల తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి . ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యం , ఇప్పటికైనా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి, పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న సింధు ఆదర్శ్ రెడ్డి

- **వార్షికోత్సవ మహోత్సవంలో ప్రత్యేక పూజలు**

**రామచంద్రపురం, జూన్ 28 (సిరి న్యూస్):**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి 8వ వార్షికోత్సవ మహోత్సవంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ మహోత్సవాలు భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు.

అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సింధు ఆదర్శ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షులు నంద గోపాల్, సత్యనారాయణ, అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు యాదగిరి, నరసింహారావు, కమిటీ సభ్యులు సుధాకర్, విజయ్, సంతోష్, రవి, రామకృష్ణ, భాను, సాయి పాల్గొన్నారు.



# తెల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**రామచంద్రపురం, జూన్ 28 (సిరి న్యూస్):**

తెల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లో 1981-82 విద్యాసంవత్సరానికి చెందిన 7వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 45 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి, రామచంద్రపురం మండల మాజీ ఎంఈఓ పి. రామ్‌రెడ్డి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు సి. అంజిరెడ్డి, రిటైర్డ్ సైన్స్ టీచర్ జై నరసింహారెడ్డి, రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ పట్వారి బి. సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు అనుబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, సమాజానికి సేవ చేసే దిశగా స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి జ్ఞాపికలు అందజేసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలి...

- **ఆలయ భక్తులు, గ్రామస్థుల ఆవేదన...**

**హత్నూర, జూన్ 28,(సిరి న్యూస్)**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామ సమీపంలోని పలుగు మీది పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులు,చుట్టూ ప్రక్కల ప్రయాణించే స్థానిక గ్రామస్తులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివారం ఆలయం కమాన్ వద్ద ఉపసర్పంచ్ ఎం.డి. హుసేన్ వార్డు సభ్యులు గ్రామస్థులతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నర్సాపూర్ నుండి షేర్‌ఖాన్‌పల్లి మీదుగా నాగారం, పటాన్‌చెరువు వెళ్లే బస్సు సౌకర్యం గత రెండు నుంచి మూడు సంవత్సరాలుగా నిలిచిపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు, ఉద్యోగులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా పలుగు మీది పోచమ్మ ఆలయానికి ప్రతి రోజు, ఆదివారం, పండుగ రోజుల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. గతంలో బీహెచ్ఈఎల్ డిపోకు చెందిన బస్సు ఈ మార్గంలో నడిచేదని, ప్రస్తుతం నర్సాపూర్ డిపో నుంచి ప్రయాణించే బస్సు కూడా రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

అధికారులు, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి నర్సాపూర్-షేర్‌ఖాన్‌పల్లి-నాగారం-పటాన్‌చెరువు మార్గంలో బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, సంపత్, శ్రీకాంత్‌తో పాటు మహిళలు, యువకులు పాల్గొన్నారు.





# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- **జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్.**

**మెదక్,**
**జూన్, 28(సిరి న్యూస్)**

మెదక్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఇటీవల ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆదివారం జర్నలిస్టులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణాలు తప్పకుండ పాటించాలన్నారు. జర్నలిస్టుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శంకర్ దయాల్ చారి, కమాటి కృష్ణ, సంగమేశ్వర్, ఉషయ్య, ఆంజనేయులు, ఫణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



# చేపల మార్కెట్ను పరిశుభ్రంగా ఉంచాలి

- **మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.**

**రామాయంపేట, జూన్ 28 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపల్ పరిధిలో ప్రతీ బుధవారం మార్కెట్ రోజు మల్లెచెరువు కట్టపై ఫిష్ మార్కెట్ జరుగుతుంది. ఫిష్ కటింగ్ చేసిన వెస్టేజ్ అంత అక్కడే వేయటం వలన దాని వల్ల వచ్చే వాసనకు 1వ, 7వ వార్డ్ ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని అక్కడి ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా వెంటనే స్పందించి మల్లెచెర్వు కట్ట దగ్గరకు వెళ్లి పరిశీలించి ప్రతీ బుధవారం అక్కడ చెత్తబండి పెట్టి, వేస్టేజ్ అంత బండిలో వేయాలని శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనిత కు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పుట్టి సందీప్, దేవుని రంజిత్, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షులు దాకి స్వామి, ఫిషరీస్ పట్టణ అధ్యక్షులు తొంటావాలి యాదగిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, సుధీర్, నరేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రపురం, జూన్ 28 (సిరి న్యూస్) :**

దేశవ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ బస్తీ దవాఖానా, ఎల్ఐజీ కాలనీ సొసైటీ కార్యాలయం సమీపంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలనలో తల్లిదండ్రులు తమ బాధ్యతగా చిన్నారులకు చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశుతోష్, బస్తీ దవాఖాన ఏఎన్ఎంలు యమున, సారా, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకుడు గౌస్, నరసింహ, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలకు 'అమ్మ' జిల్లాకు కలెక్టరమ్మ..!

- **నిండు ప్రాణాలకు రెండు చుక్కలు..**
- **తమ కుమార్తెలకు పోలియో చుక్కలు వేయిస్తూ ఆదర్శంగా నిలిచిన కలెక్టర్ దంపతులు.**

**మెదక్**
**జూన్, 28(సిరి న్యూస్)**

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ దంపతులు తమ 10 నెలల చిన్నారులు ఏకాంషి, అద్విత,లకు క్యాంపు కార్యాలయంలో పల్స్ పోలియో 0.5 కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలు వేయించి ఆదర్శంగా నిలిచారు.

జిల్లాలో 5 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలు ఎవరూ వదలకుండా పోలియో చుక్కలు వేయించడమే మన లక్ష్యం కావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నవ్య, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.







# హస్తాల్పూర్ లో శ్రీ మహాలక్ష్మి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

**వెల్దుర్తి, జూన్ 28, (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం హస్తాల్పూర్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్ అదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, విభాగాలకు చెందిన డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మధు, రాజు,నిపుణులైన వైద్యులు పాల్గొని ఉచిత వైద్య సేవలు అందించారు. పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 200 మందికి పైగా స్థానిక ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి నర్సింహారెడ్డి, మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంతాలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం మహాలక్ష్మి యాజమాన్యాన్ని అభినందించారు.

# పల్స్ పోలియో కార్యక్రమంలో పాలుగోన్న నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత రెడ్డి

**వెల్దుర్తి, జూన్ 28, (సిరి న్యూస్):**

పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా వెల్దుర్తి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో మెదక్ డిఎంహెచ్ఓ తో కలిసి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసిన సునీత లక్ష్మారెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, , స్థానిక నాయకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## లైన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శిగా

# దేమే యాదగిరి..

- గవర్నర్ చేతుల మీదుగా నియామక మాత్రం.

**రామాయంపేట, జూన్ 28 (సిరి న్యూస్)**



లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 D డిస్ట్రిక్ట్ సెక్రటరీగా మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దేమే యాదగిరి ఎన్నికయ్యారు. దేమె యాదగిరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం లోని కొంపల్లి లో నిమ్మల గార్డెన్స్ లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ శ్రీమతి విజయలక్ష్మి చేతుల మీదుగా యాదగిరి నియామక పత్రం అందుకున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, తడి పొడి చెత్తను వేరు చేయుట, కాలుష్యాన్ని నివారించుటకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు విశేషంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా దేమె యాదగిరి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి, జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు బాబు రావు గారికి, అమర్నాథ్ రావు గారికి లైన్స్ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా లైన్స్ క్లబ్ కార్యదర్శిగా యాదగిరి ఎంపిక పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. జి. శ్రీనివాస శర్మ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సింగం శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్ తో పాటు పలువురు ఉన్నారు.



## జోగిపేటలో పల్స్ పోలియో చుక్కలు వేసిన చైర్మన్, వైస్ చైర్మన్

**జోగిపేట, జూన్ 28, (సిరి న్యూస్):**

జోగిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణరెడ్డి వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)17 వ వార్డు కౌన్సిలర్ నేనావత్ మేఘరాణి సైలాన్ 1వ వార్డు గడ్డి అరుణ్ కుమార్ డాక్టర్ శంకర్ నాయక్ సిస్టర్స్ అంగన్వాడీ టీచర్స్ ఆశవర్కర్ అడ్డు భాయ్ అంతం చరణ్ , వెంకటేశం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు పోలియో అని సాధారణంగా పిలవబడే 'పోలియో మైలేటిస్' అనే వ్యాధి వైరస్ ద్వారా కలిగి నాడి మండలాన్ని దెబ్బ తీసే ఒక వ్యాధి పోలియో వర్గీకరణ పోలియో అనేది ఒక వికలాంగ వ్యాధి ఇది పోలియో వైరస్ అని పిలవబడే వైరస్ వల్ల వస్తుంది ఈ వైరస్ ఒక వ్యక్తి నుండి మరొకరికి వ్యాపించి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది ప్రతి ఇంట్లో 05 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేసి అంగవైకల్యం రాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.



## మనమందరం కలిసి పని చేద్దాం. గ్రామంలో పోలియోను పూర్తిగా నిర్మూలిద్దాం..

- సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్...

**శివంపేట జూన్ 28(సిరి న్యూస్ )**

శివంపేట మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయినా శివంపేటలో జాతీయ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్ పాలకవర్గ సభ్యులు వైద్య శాఖ సిబ్బంది అంగన్వాడి టీచర్ల సమక్షంలో జాతీయ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివంపేట గ్రామంలో మనమందరం కలిసి పని చేద్దాం పోలియోను పూర్తిగా నిర్మూలిద్దాం అని అన్నారు. గ్రామంలో ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తు చేశారు. పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవి అని ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియో చుక్కల ముందుకు చక్కని స్పందన

**పాపన్నపేట జూన్ 28 సిరి న్యూస్:**

పాపన్నపేట మండలంలో పల్స్ పోలియో చుక్కల ముందుకు చక్కని స్పందన లభించింది. జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాపన్నపేట మండల పరిధిలోని పాపన్నపేట, పొడిచన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో వివిధ గ్రామాలలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు వైద్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. పాపన్నపేట పి హెచ్ సి లో 2856 పిల్లలకు గాను, 2827 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ఎండి అన్వర్, సిహెచ్ఓ చందర్ లు తెలిపారు. పొడిచన్ పల్లి పి హెచ్ సి లో 2268 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు సురక్షితమైనవని, పాపన్నపేట మండలంలో కార్యక్రమం పూర్తిగా విజయవంతం ఐనదని వారు వివరించారు.




# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం.!

- ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి
- పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్, 28(సిరి న్యూస్)**

ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం, మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై,ప్రారంభించారు.ఈ సందర్భంగా 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు స్వయంగా కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైందన్నారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబం తమ చిన్నారులను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు సురక్షితమైనవి, అత్యంత ప్రభావవంతమైనవని తెలిపారు.జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలియో కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు రాలేని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి చిన్నారి పోలియో చుక్కలు తీసుకునే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచో గణేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,ఇతర సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ*
- వెల్దుర్తిలో నూతన గ్రంథాలయ భవనా ప్రారంభం.

**వెల్దుర్తి, జూన్ 28, (సిరి న్యూస్) :**




నర్సాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అదివారం వెల్దుర్తి మండల కేంద్రం లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, మెదక్ గ్రంధాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాజిరెడ్డిలతో,కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చిన ఆయన, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరము అగు పుస్తకాలు అందుబాటులో ఉన్నావని వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, సుధాకర్ గౌడ్, శేఖ గౌడ్, స్థానిక ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్,స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మక్తక్యాసరంమునిపల్లి R&B డబుల్ రోడ్డు మంజూరు

**మునిపల్లి, జూన్ 28 (సిరి న్యూస్):**

మక్తక్యాసరం నుంచి మునిపల్లి (వయా అల్లాపూర్) మీదుగా రూ.30 కోట్ల వ్యయంతో డబుల్ లైన్ R&B రోడ్డుకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల అధ్యక్షుడు పిల్లోడి సతీష్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రెస్ నోట్ లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆధ్వర్యంలో పంచాయతీ రోడ్డును R&B రోడ్డుగా మార్చి డబుల్ లైన్ రోడ్డును మంజూరు చేయడం మండల అభివృద్ధికి కీలక అడుగని అన్నారు. మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపులారం పాండు, మాజీ PACS చైర్మన్ విజయ్ కుమార్, బుదేరా రహీం, AMC డైరెక్టర్ మహేష్ కురుమ, సోషల్ మీడియా ఇన్చార్జ్ కలీం పాషా తదితరులు పాల్గొన్నారు.


TRANSPORT, ROADS AND BUILDINGS (R.II) DEPARTMENT

G.O.Rt.No.354 — Dated:27.06.2026

Read:

From the Engineer-in- Chief (R&B) SR, Hyderabad, Lr.No.Andole/DCE-R/EE-R/DEE-II/AEE-II/2026, Dt.23.02.2026

ORDER:-

In the circumstances stated by the Engineer-in- Chief (R&B) SR, Hyderabad in reference read above, Government after careful examination of the matter hereby accord administrative sanction for an amount of Rs. 100.00 Crores (Rupees One Hundred Crores Only) for taking up of (03) works in Andole Assembly Constituency as shown below in table, under PLAN MDR Head of Account: 5054-04-MH 337-GH 25 – SH (07) – 530 – 531 duly allocating additional budget.

| Sl. No. | Name of the work | Amount in Crores |
|---|---|---|
| 1 | Widening of Single lane carriageway to Double lane of PWD road Makthakyasaram to Munipally (via) Garlapally, Allapur from Km 0/0 to 10/0 in Sangareddy District | 30.00 |
| 2 | Widening and Strengthening of Sangupet to Pocharam road from Km 0/0 to 18/0 & Widening of Single lane Carriageway to Double lane of Minpur to Mudimanikyam from 0/0 to 3/3 in Sangareddy District | 40.00 |
| 3 | Widening and Strengthening including construction of High Level Bridges of Narsingi to Shankarampet road from Km 0/0 to 11/0 in Medak District | 30.00 |
| | Total amount | 100.00 |

2. The (I/c) Chief Engineer (R&B), State Roads, Hyderabad shall take further action accordingly.

3. This order issues with the concurrence of Finance (EBS.X) Department vide their U.O.No. 3607405/141/A1/EBS.X/2026, Dated 24-03-2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

VIKAS RAJ
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT






## కార్యకర్తల సమిష్టి కృషి ఫలితమే బీజేపీ కార్యాలయం

- గతంలో ఒకరిద్దరే ఉంటుండే నేడు కుర్చీలు సరిపోలేనంత మంది ప్రజా ప్రతినిధులు .
- పంచాయతీ మెంబర్ నుండి పార్లమెంట్ వరకు ఇక్కడి నుండే భవిష్యత్తు కార్యచరణ
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

**మెదక్, జూన్, 28(సిరి న్యూస్)**

కార్యకర్తల సమిష్టి కృషితోనే నేడు జిల్లా బిజెపి కార్యాలయం ప్రారంభించుకుంటున్నామని మెదక్ ఎంపీ,మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు.మెదక్ బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన బీజేపీ నాయకులు,శ్రేణులతో కలిసి బీజేపీ జిల్లా నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు తెలంగాణాలోని వివిధ జిల్లాలతో పాటు మెదక్ భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా కార్యాలయాన్ని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ గారు ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు.నేడు పార్టీ శ్రేణులకు ఎంతో ఆనందదాయకమైన, చారిత్రాత్మకమైన సందర్భంగా నిలిచిందన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ, పార్టీ కార్యాలయం కార్యకర్తలకు దేవాలయంతో సమానమని, ఇక్కడి నుంచే పార్టీ కార్యక్రమాలు మరియు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించబడుతాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతమై ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి ఆశయాలకు అనుగుణంగా 'సబ్ కా సాత్'సబ్ కా వికాస్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,రాగి రాములు,జిల్లా నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, పంజా విజయ్, సత్యనారాయణ,సురేష్, నాయిని ప్రసాద్, ఈర్ల రంజిత్ రెడ్డి, ఏంఎల్ఎన్ రెడ్డి,బుచ్చేష్ యాదవ్,సంతోష్ రెడ్డి,మందాపురం సతీష్, అఖిల, బెండే వీణ, హరీష్,జిల్లా పదాధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు,మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రెండు చుక్కలు వేయిద్దాం

- అవిటితనాన్ని నిర్మూలిద్దాం
- చిన్నారులకు ఆరోగ్యమైన జీవితాన్ని ప్రసాదిద్దాం
- తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని
- వైస్ చైర్మన్ కొక్కొండ సమత

**తూప్రాన్ జూన్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఆదివారం పల్స్ పోలియో కేంద్రాలను సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ సమత కాశి రెడ్డి చైర్మన్ రజిని మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ఎక్కడ ఉన్న అక్కడ తల్లిదండ్రులు తప్పకుండా పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించుకోవాలని రెండు చుక్కలతో అంగవైకల్యం లేకుండా చిన్నారులు ఎదుగుతారని చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చిన్నారుల జీవితాలు అంగవైకల్యాలకు లోనై జీవితకాలం
వారి తో పాటు తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు బాధపడాల్సి ఉంటుందని ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్ రాములు సత్తార్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమం

**నర్సాపూర్ జూన్ 28 (సిరి న్యూస్)**

పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో పసి పిల్లలకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరాల లోపు పిల్లల అందరికీ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు నర్సులు నాయకులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు







# అంబేద్కర్ విగ్రహం సమానత్వానికి ప్రతీక.!!

- సామాజిక న్యాయానికి చిహ్నం!!
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ!!
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి !!

**శివంపేట జూన్ 28 ( సిరి న్యూస్ )**

శివ్వంపేటమండల కేంద్రంలోని పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలోముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సువాసిని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పిల్లుట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహం సమానత్వానికి ప్రతీక. సామాజిక న్యాయానికి చిహ్నం. ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి. ప్రతి యువకుడికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ జీవితం - మనందరికీ ఆదర్శమన్నారు.చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు. చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే... పుట్టుక మన చేతిలో ఉండదు... కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుందన్నారు. బాబాసాహెబ్ డా. బి ఆర్ అంబేద్కర్ బహుభాషావేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేశారు. అంబేద్కర్ తన కోసం జీవించలేదు. సమాజం కోసం జీవించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారు. గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు" అని ఆయన మనకు నేర్పించారు. మన దేశానికి బీ.ఆర్ అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి... సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించిందన్నారు అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పిగా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం. మన యువతబాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. విద్యను ఆయుధంగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవులరాజి రెడ్డి, మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అభిమానులు గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు చుక్కలతో సురక్షిత భవిష్యత్తు
# చిరునవ్వులతో పోలియో చుక్కల పంపిణీ

**జిన్నారం జూన్ 28 సిరి న్యూస్**

గడ్డపోతారం పురపాలిక పరిధిలోని కాజిపల్లి గ్రామంలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడి కేంద్రాలలో కౌన్సిలర్ స్వప్న కుమార్ యాదవ్ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్వప్న కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు బాధ్యతగా భాగస్వాములు కావాలని భవిష్యత్తు తరాల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు.
సిబ్బందికి అభినందనలు సెలవు రోజున కూడా ఉత్సాహంగా పాల్గొని సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు అంగన్వాడీ టీచర్లకు మరియు ఆరోగ్య సిబ్బందికి కౌన్సిలర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## పల్స్ పోలియోకు ప్రేమ్ సాగర్ రావు శ్రీకారం..

- ఎమ్మెల్యే చేతుల మీదుగా పల్స్ పోలియో ప్రారంభం..
- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కలు తప్పనిసరి..
- పోలియో నిర్మూలనకు తల్లిదండ్రులకు పిలుపు..
- మాతా,శిశు ఆసుపత్రిలో ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమం..

**మంచిర్యాల, జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 28 (సిరి న్యూస్)**

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల మాతాశిశు సంక్షేమ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ఉన్న ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు.
కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## రెండు చుక్కలతో సురక్షిత భవిష్యత్తు

- చిరునవ్వులతో పోలియో చుక్కల పంపిణీ

**జిన్నారం జూన్ 28 సిరి న్యూస్**

గడ్డపోతారం పురపాలిక పరిధిలోని కాజిపల్లి గ్రామంలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడి కేంద్రాలలో కౌన్సిలర్ స్వప్న కుమార్ యాదవ్ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్వప్న కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు బాధ్యతగా భాగస్వాములు కావాలని భవిష్యత్తు తరాల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు.



సిబ్బందికి అభినందనలు సెలవు రోజున కూడా ఉత్సాహంగా పాల్గొని సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు అంగన్వాడీ టీచర్లకు మరియు ఆరోగ్య సిబ్బందికి కౌన్సిలర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# బెల్లంపల్లికి రూ.4 కోట్ల విద్యా వరం..

- రూ.4 కోట్లతో విద్యా భవనాలకు శంకుస్థాపన..
- బెల్లంపల్లిలో ఉన్నత విద్యకు భారీ ఊతం..
- విద్యార్థులకు స్థానికంగానే పీజీ సౌకర్యం..
- విద్యాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వినోద్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 28 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఉన్నత విద్యా మౌలిక సదుపాయాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. బెల్లంపల్లి డిగ్రీ కళాశాల ఆవరణలో మొత్తం రూ.4 కోట్ల వ్యయంతో రెండు విద్యా భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, బెల్లంపల్లి విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలతో విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రూ.2 కోట్లతో నూతన పీజీ కళాశాల భవనం, మరో రూ.2 కోట్లతో మహాత్మా జ్యోతిబా పూలే భవన నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన



చేశారు. ఈ భవనాల నిర్మాణంతో విద్యార్థులకు ఆధునిక వసతులు, మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, రమేష్ బాబు, సర్పంచులు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.





## రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవానికి హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ

**వెల్దుర్తి,జూన్ 28, ( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రం లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ మహోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేదమంత్రాలతో మంత్రికి ఘన స్వాగతం పలికిన గౌడ సంఘం నాయకులు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న మంత్రి మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని వారు తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో , నర్సాపూర్ ఇన్చార్జ్ రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్,తదితరులు గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.





## పల్స్ పోలియో చుక్కల
# ముందుకు చక్కని స్పందన

**పాపన్నపేట జూన్ 28 సిరి న్యూస్:**

పాపన్నపేట మండలంలో పల్స్ పోలియో చుక్కల ముందుకు చక్కని స్పందన లభించింది. జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాపన్నపేట మండల పరిధిలోని పాపన్నపేట, పొడిచన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో వివిధ గ్రామాలలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు వైద్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. పాపన్నపేట
పి హెచ్ సి లో 2856 పిల్లలకు గాను, 2827 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ఎండి అన్వర్, సిహెచ్ఓ చందర్ లు తెలిపారు. పొడిచన్ పల్లి పి హెచ్ సి లో 2268 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు సురక్షితమైనవని, పాపన్నపేట మండలంలో కార్యక్రమం పూర్తిగా విజయవంతం ఐనదని వారు వివరించారు.

## రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవానికి హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ

**వెల్దుర్తి,జూన్ 28, ( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రం లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ మహోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేదమంత్రాలతో మంత్రికి ఘన స్వాగతం పలికిన గౌడ సంఘం నాయకులు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న మంత్రి మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని వారు తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో , నర్సాపూర్ ఇన్చార్జ్ రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్,తదితరులు గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.





## ఆనాటి సవాళ్లు, అవమానాలే నన్ను స్ట్రాంగ్‌గా ఉండేలా చేశాయి..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే 'మిచ్చర్ బచ్చన్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ అమ్మడుకి ఒక్క హిట్ కూడా పడలేదు. అయినప్పటికీ భాగ్యశ్రీ బోర్సేకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు రెండు భారీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. 'సెయాన్' మూవీతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టబోతున్నారు. అలాగే తెలుగులో అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ కనిపించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా జూలై 10న విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా.. ప్రమోషన్స్‌లో భాగంగా భాగ్యశ్రీ తన బాల్యంలో జరిగిన చేదు అనుభవాలను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. నైజీరియాలోని లాగోస్‌లో గడిపిన తన బాల్య జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన బాల్యమంతా నైజీరియాలోని లాగోస్ నగరంలోనే గడిపానని.. అక్కడి వాతావరణంలో పెరగడం వల్ల ఓ ప్రత్యేకమైన యాస అలవడిందని అన్నారు. అయితే, ఆ తర్వాత భారతదేశానికి వచ్చి పాఠశాలలో చేరినప్పుడు.. తన విభిన్నమైన యాస కారణంగా క్లాస్‌మేట్స్ నుండి తీవ్రమైన వేధింపులను ఎదుర్కోవాల్సి వచ్చిందని వెల్లడించారు. మిగతా పిల్లల కంటే భిన్నంగా మాట్లాడటంతో అందరూ తనను వింతగా చూసేవారని, స్కూల్లో ఎగతాళి చేస్తూ ఏడిపించేవారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వయసులో అది తనను ఎంతో మానసిక

## ఆ మూడు సినిమాల విషయంలో నేను పెద్ద తప్పు చేశాను

డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, నిర్మాతగా అంచెలంచెలుగా ఎదిగిన వారిలో దిల్ రాజు ఒకరు. 'దిల్' సినిమాతో ఆయన నిర్మాతగా కెరీర్‌ను ప్రారంభించారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ ప్రారంభంలో తాను చేసిన కొన్ని తప్పుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. దిల్ రాజు మాట్లాడుతూ.. "నిర్మాతగా కెరీర్‌ను ప్రారంభించిన రోజుల్లో నిర్మించిన 'దిల్', 'ఆర్య', 'భద్ర' సినిమాల శాటిలైట్ హక్కులను ఎలాంటి కాలపరిమితి ఒప్పందం లేకుండానే విక్రయించాను. తర్వాత అలా చేయకూడదని నాకు అర్థమైంది. ఆ తప్పు తెలుసుకున్న తర్వాత 'బొమ్మరిల్లు' సినిమా నుంచి ప్రతి సినిమాకు 5 లేదా 10 సంవత్సరాల కాలపరిమితితోనే శాటిలైట్ హక్కుల ఒప్పందాలు చేసేవాడిని.

'దిల్' సినిమా శాటిలైట్ హక్కులకు రూ.35 లక్షలు, 'ఆర్య' సినిమాకు రూ.45 లక్షలు వచ్చాయి. కెరీర్ ప్రారంభంలో శాటిలైట్ హక్కుల విషయంలో నేను పెద్ద తప్పు చేశానని ఇప్పుడు అనిపిస్తోంది" అని దిల్ రాజు తెలిపారు. ఇక 'దిల్' సినిమాలో నితిన్ హీరోగా నటించగా, వి.వి. వినాయక్ దర్శకత్వం వహించారు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'ఆర్య'కు సుకుమార్ దర్శకత్వం వహించగా, రవితేజ హీరోగా రూపొందిన 'భద్ర' చిత్రానికి బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. 'దిల్' చిత్రాన్ని మినహాయిస్తే, 'ఆర్య' మరియు 'భద్ర' సినిమాలతో సుకుమార్, బోయపాటి



## ఇండస్ట్రీలో నటీనటుల కంటే కూడా పాత్రలే చాలా గొప్పవి



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ఓ వైపు రాజకీయాల్లో రాణిస్తూనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. కంగనా నటించిన 'ఎమర్జెన్సీ' బాక్సాఫీసు వద్ద పెద్దగా హిట్ అందుకోలేకపోయింది. ఇటీవల కంగనా 'భారత్ భాగ్య విధాత'తో వచ్చిన ఆమె.. తన నటనతో అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఇందులో ధైర్యవంతురాలైన నర్స్ పాత్రలో ఒదిగిపోయారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పటినుంచో తనపై ఎంతోమంది ఎన్నో రకాలుగా విమర్శలు చేస్తూనే వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను రాజకీయాల్లోకి వచ్చి ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలు మాత్రం తనను అస్సలు వదలడం లేదని పేర్కొన్నారు. హిందీ ఇండస్ట్రీలో దశాబ్ద కాలానికి పైగా సాగిన తన కెరీర్‌ను ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. నటిగా తన ఎదుగుదలకు మనసుకు హత్తుకునే బలమైన కథలే ముఖ్య కారణమని ఆమె వివరించారు. తన కెరీర్ మొదటి నుండి కూడా అలాంటి విభిన్నమైన కథలకే తాను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చానని చెప్పారు.

సినిమా ఇండస్ట్రీలో నటీనటుల కంటే కూడా వారు పోషించే పాత్రలే చాలా గొప్పవని తాను బలంగా నమ్ముతానని కంగనా స్పష్టం చేశారు. అయితే, అలాంటి గొప్ప పాత్రలు మన దగ్గరకు రావడానికి ఎంతో సహనం, ఓర్పు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఇండస్ట్రీలో కొందరు స్టార్ హీరోలు చేసే రొటీన్, కమర్షియల్ సినిమాలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ క్రమంలో ఎంతో మందికి మనం టార్గెట్ అవ్వాల్సి వస్తుందని, ఒక్కోసారి ఇండస్ట్రీలో ఉండే కొందరు వ్యక్తులు మనకు దక్కాల్సిన సినిమాలను కూడా రాకుండా అడ్డుపడతారని సంచలన వ్యాఖ్యలు చేశారుఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ మన మనసుకు నచ్చని కథలను ఎప్పుడూ దూరంగానే పెట్టాలని కంగనా రనౌత్ సూచించారు. అలా రిస్క్ తీసుకుని నచ్చని సినిమాలను తిరస్కరించినప్పుడే, ఒక సాధారణ రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో కాకుండా మనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు దక్కుతుందని చెప్పారు. తాను కూడా ఇండస్ట్రీలో ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదుర్కొన్నప్పటికీ.. తన కెరీర్‌ను అలాగే ఎంతో పట్టుదలతో బిల్డ్ చేసుకున్నానని, అందుకే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని కంగనా గర్వంగా చెప్పుకొచ్చారు.

## సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌ను వదిలేస్తున్నారా?

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ (Salman Khan) ముంబయిలోని బాంద్రాలో కొత్తగా ఇంటిని నిర్మించుకునేందుకు అనుమతి పొందారు. దీంతో ఖాన్ కుటుంబం త్వరలో దానిలోకి మారనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే 1974 నుంచి ఆయన నివాసం ఉంటున్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌ను ఖాళీ చేస్తారా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. బాంద్రాలోని చింబాయ్ ప్రాంతంలో ఈ కొత్త భవన నిర్మాణానికి పర్యావరణ అధికారులు జూన్ 16న అనుమతులు జారీ చేశారు. ఈ స్థలం సల్మాన్ తల్లి సల్మా ఖాన్ పేరు మీద ఉంది. ఇక్కడ శిథిలావస్థకు చేరిన పాత ఇంటిని కూల్చేసి.. ఆరు అంతస్తుల భవనం నిర్మించనున్నారు. నిర్మాణ సమయంలో చెట్లను నరకకూడదని అధికారులు షరతులు విధించారు.

సల్మాన్‌కు గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌తో విడదీయరాని అనుబంధం ఉంది. పండుగలకు, పుట్టినరోజుకు అక్కడి నుంచే ఆయన అభిమానులకు అభివాదం చేస్తుంటారు. అయితే, గతంలో ఆ అపార్ట్‌మెంట్‌పై లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ వరుస బెదిరింపుల నేపథ్యంలోనే సల్మాన్‌కు పోలీసులు భారీ భద్రతను కల్పించారు. ప్రస్తుతం ఆయన ఉండే అపార్ట్‌మెంట్ కంటే కొద్ది దూరంగానే ఈ కొత్త ఇల్లు నిర్మించనున్నారు. హీరోకు భద్రతాపరంగా అక్కడ మరింత సురక్షితంగా ఉంటుందని భావిస్తున్నారు. సల్మాన్ కుటుంబం కూడా అక్కడికి



## 'టాక్సిక్' చూశాక యష్ ఫ్యాన్స్ మైండ్ బ్లాక్ అవ్వడం ఖాయం..

కన్నడ రాకింగ్ స్టార్ యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'టాక్సిక్' పలు వాయిదాల తర్వాత ఆగస్టు 26న విడుదలకు సిద్ధమైంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా.. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాంలో విడుదలవుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ కోసం యష్ ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కెజీఎఫ్ వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వస్తున్న సినిమా కావడంతో అందరి కళ్లు 'టాక్సిక్'పై పడ్డాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హుమా ఖురేషి.. 'టాక్సిక్' యష్ ఫ్యాన్స్‌కు గొప్ప విందు కాబోతుందని అంచనాలను రెట్టింపు చేశారు. "ఈ సినిమాలో యశ్‌తో కలిసి వర్క్ చేసినప్పటి నుండి నేను ఆయనకు చాలా పెద్ద ఫ్యాన్ అయిపోయాను. అంతకుముందు ఆయన నాకు కేవలం ఒక మాస్ ఫాలోయింగ్ ఉన్న పెద్ద స్టార్‌గా మాత్రమే తెలుసు. కానీ, ఆయన వర్క్ చేసే విధానం, సినిమా పట్ల ఆయనకు ఉన్నకసి, యష్ ఆలోచనా విధానం దగ్గరి నుండి చూశాక నేను ఆయన నుండి ఎంతో నేర్చుకున్నాను" అంటూ యశ్‌పై ప్రశంసల కురిపించారు.






ప్రేక్షకులు థియేటర్లకు వచ్చినప్పుడు వారికి ఒక బెస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడం కోసమే చిత్రబృందం మొత్తం పగలు రేయి కష్టపడుతోందని ఆమె చెప్పారు. సినిమా అవుట్‌పుట్ ఎలా వస్తుందనే దానిపై హుమా స్పందిస్తూ.. "నేను ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఒక 8 నుండి 9 నిమిషాల చిన్న కట్ ఫుటేజ్ చూశాను. అది చూశాక నా మైండ్ బ్లాక్ అయింది. మేకర్స్ నిజంగా ఏదో ఒక అద్భుతాన్ని స్క్రీన్‌పై చూపించబోతున్నారని అర్థం అయింది. సినిమా ఎప్పుడు రిలీజ్ అయినా సరే, ప్రేక్షకులకు ఇది ఒక సినిమాటిక్ స్టోర్మ్‌లా తగలడం ఖాయం. యశ్ తన నటనతో ఇందులో నెక్స్ట్ లెవెల్‌కు వెళ్ళిపోయారు. ఆయన అభిమానులకు ఇది ఒక

## అప్పుడు చనిపోతానేమో అనిపించింది

ముంబయి బాంద్రాలోని తన నివాసంలో 2025 జనవరి 16న రాత్రి జరిగిన దాడి గురించి బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ (Saif Ali Khan) తొలిసారి మాట్లాడారు. దుండగుడు తన చిన్న కుమారుడు జేహ్‌పై దాడి చేశాడని.. ఆ ఘటన గురించి ఆలోచిస్తున్నప్పుడు ఇప్పటికీ ప్రాణం పోయేంత భయం వేస్తుందని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆ రాత్రి జరిగిన కొన్ని విషయాలను సైఫ్ పంచుకున్నారు.

"ఆరోజు రాత్రి అందరం పడుకున్నాం. కాసేపటికి ఆయా పరుగెత్తుకుంటూ వచ్చి ఎవరో కత్తితో జేహ్ గదిలోకి వచ్చి డబ్బు అడుగుతున్నారని చెప్పింది. వెంటనే ఆ గదిలోకి వెళ్లాను. దుండగుడు జేహ్‌ను పట్టుకున్నాడు. ఆ క్షణంలో నేను ఏమీ ఆలోచించలేదు. అతడిపై దాడి చేశాను. వాడు కత్తులతో విచక్షణారహితంగా నాపై దాడి చేశాడు. నా చుట్టూ అంతా రక్తమే ఉంది. ఇంతలో ఆయా వచ్చి ఆ దుండగుడిని గది నుంచి బయటకు తరిమింది. ఆ దాడిలో నాకు ఆరు కత్తి గాయాలు అయ్యాయి. అందులో ఒకటి వెన్నెముకకు దగ్గరగా తగిలింది. నా తెల్లటి కుర్తా పైజామా రక్తంతో తడిసిపోయింది. చనిపోతానేమో అనిపించింది" అని సైఫ్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిని క్షమిస్తారా..? అని అడగ్గా.. "క్షమించాలని ఉంది. కానీ అతడు పెద్ద తప్పు చేశాడు. నన్ను చంపడానికి ప్రయత్నించాడు. అది మరిచిపోలేకపోతున్నా" అని సైఫ్ బదులిచ్చారు. ఈ ఘటన తర్వాత ముంబయి పోలీసులు బంగ్లాదేశ్‌కి చెందిన దుండగుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాంను అరెస్ట్ చేశారు.



## అవి ఐటమ్ సాంగ్‌లు కాదు... పార్టీ పాటలంతే...!

'అన్నివర్గాల ప్రేక్షకులు ఆస్వాదించే ప్రత్యేక గీతాలను ఎంచుకున్నప్పుడు వాటిని ఐటమ్ పాటలుగా చూడను.. నా వరకు అవి ప్రత్యేక డ్యాన్స్ నంబర్లే' అని అంటోంది కథానాయిక తమన్నా. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తూనే.. ప్రత్యేక గీతాల్లో హుషారైన స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తుంటుంది ఈ తార. ప్రస్తుతం హిందీ చిత్రసీమలో వరుస సినిమాలతో బిజీగా ఉంది. ప్రత్యేక గీతాల గురించి తమన్నా మాట్లాడుతూ "కరీనా, కత్రినా ఓ పాటలో డ్యాన్స్ చేయడం ప్రేక్షకులకు గుర్తుండకపోవచ్చు. కానీ వాళ్లు చేసిన 'చమ్మక్ చల్లో...', 'షీలా కీ జవానీ...', 'కమ్లీ...' లాంటి పాటలు మాత్రం ఎప్పటికీ గుర్తుంటాయి. ఈ ప్రత్యేక గీతాల్లో నటీమణులు ప్రదర్శించిన హుందాతనంతో సహా. వీటిలో ఆ తారలందరూ తమను తాము ఆస్వాదిస్తూ ఆడిపాడారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఇలాంటి పాటలకి డ్యాన్స్ చేస్తారు. నా వరకు ఇవి పార్టీ డ్యాన్స్ పాటలంతే. వీటిని ఒక ఐటమ్ సాంగ్‌లా పిలిచేందుకు ఇష్టపడను. ఎందుకంటే ఇవి చివరి వరకు పార్టీ పాటలుగానే ఉంటాయని భావిస్తున్నాను" అని చెప్పింది.



## ఆ తిరస్కారంతోనే 'కల్కి'లో బుజ్జి పాత్ర

ప్రపంచ సినీప్రియుల్ని అలరించిన చిత్రం 'కల్కి 2898ఏడీ'. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం విడుదలై నేటితో రెండేళ్లు పూర్తయింది. ఇందులో తన గొంతుతో బుజ్జి పాత్రకు ప్రాణం పోసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది నాయిక కీర్తి సురేశ్. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. "నాగ్‌అశ్విన్ ఈ సినిమాలో బుజ్జి కాకుండా మరో పాత్రను చేయమని ఆఫర్ చేశారు. కానీ దాని పట్ల నాకెందుకో అంత నమ్మకం కలగలేదు. కానీ ఆ తర్వాత రోజు ఆయన నన్ను మరో అద్భుతమైన పాత్ర ఉంది.. కనీసం అదైనా చేస్తావా? అని అడిగారు. తన సినిమాలో కచ్చితంగా ఏదో ఒక విధంగా భాగమవుతానని నాకు తెలుసు. నిజానికి.. మొదటి పాత్రను తిరస్కరించినందుకు సంతోషంగా ఉంది. దానివల్లే బుజ్జి పాత్రను చేయగలిగాను. దీనికి కేవలం నా స్వరం మాత్రమే అందిస్తే చాలని చెప్పారు నాగ్‌అశ్విన్. అప్పుడు నాకు సరిగ్గా అర్థం కాలేదు. అందుకే షూటింగ్‌లో నేను పాల్గొనాల్సిన అవసరం లేదా? అని అడిగాను. "అవసరం లేదు..నాకు కేవలం మీ గొంతు మాత్రమే కావాలి" అని చెప్పారు. ఇదేదో కొత్తగా ఉందని వెంటనే ఓకే అన్నాను" అని చెప్పుకొచ్చింది కీర్తి.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.